క్లుప్తంగా

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ



సూర్యనారాయణను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: నల్లసింగయ్యగారిపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న తన కారు డ్రైవర్ వంశీ తండ్రి సూర్యనారాయణను శనివారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తన సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి, సోదరుడు దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి, రాజేశ్వరమ్మతో కలిసి పరామర్శించారు. అలాగే పులగంపల్లిలో అనారోగ్యం బారినపడిన మాజీ సర్పంచ్ కె.రవిచంద్రారెడ్డిని కూడా కలిసి ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సూర్యనారాయణ, మాజీ కో ఆప్షన్ సభ్యుడు మాబుఖాన్, నరసింహమూర్తి, ప్రతాప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న పింఛన్‌దారుల కష్టాలు



బత్తలపల్లి స్టేట్ బ్యాంకులో పింఛన్ డబ్బు కోసం తరలివచ్చిన వృద్ధులు

బత్తలపల్లి: పింఛన్ కోసం అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులకు కష్టాలు కొనసాగుతున్నాయి. ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ చేసే ప్రక్రియకు టీడీపీ కుట్ర పన్ని వలంటీర్లను దూరం చేయడంతో రెండు నెలలుగా ఇబ్బందులు పడుతున్న పింఛన్‌దారులకు ఈ నెల అవస్థలు తప్పడం లేదు. ఈ నెల పింఛన్‌ను శనివారం బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడే వారికి సచివాలయ ఉద్యోగులు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయాల ఉద్యోగులు పంపిణీ చేశారు. కొందరికి సచివాలయ ఉద్యోగులు ఇవ్వడం, మరికొందరికి బ్యాంకుల్లో జమ చేయడంతో సచివాలయాలు, బ్యాంకుల చుట్టూ లబ్ధిదారులు తిరుగుతున్నారు.

మీ సేవలు వెలకట్టలేనివి



రిటైరైన సిబ్బందితో ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: ఉద్యోగ విరమణ పొందిన ఆర్.బి ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఏఎస్ఐలు రామ్మూర్తి, రామచంద్ర, ఇబ్రహీం, ఖలీల్‌బాషాకు శనివారం పోలీసు కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. సిబ్బంది పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ముఖ్య అతిథి ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ పోలీస్ శాఖలో వీరందించిన సేవలు వెలకట్టలేనివని ప్రశంసించారు. విశ్రాంత జీవితం ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, ఏఓ సుజాత, ఏఆర్ఎస్ఐలు చంద్రశేఖర్, రవికుమార్, సూపరింటెండెంట్ సరస్వతి, ఏఎస్ఐ షౌకత్‌వలి, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారుల టీకాలపై ఆరా



టీకాల రికార్డులను పరిశీలించి సూచనలు ఇస్తున్న డీఐఓ నాగేంద్రనాయక్

గాండ్లపెంట: జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) నాగేంద్రనాయక్ శనివారం గాండ్లపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. చిన్నారులకు ఇచ్చే బీసీజీ తదితర టీకాలపై ఆరా తీశారు. క్షేత్ర స్థాయిలో ఆరువేలమందికి టీకాలు వేయాల్సి ఉండగా ఇప్పటి వరకు మూడు దశల్లో 600 మందికి పూర్తి చేసినట్లు వైద్యాధికారి మహేశ్వరమారుతి తెలిపారు. అనంతరం డీఐఓ కమతంపల్లిలో చేపట్టిన టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ బాబాఫక్రుద్దీన్, సూపర్‌వైజర్ ఉపేంద్రారెడ్డి, హెచ్ఈ విజయ్‌కుమార్, సీనియర్ సహాయకులు ఫైరోజ్, ఫార్మసిస్ట్ ప్రసాద్, ఏఎన్ఎం రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

అంత్యక్రియల ఖర్చుల అందజేత



చెక్కు అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

కదిరి అర్బన్: ఇటీవల మృతి చెందిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు నగేష్, లక్ష్మీపతి, విలాయత్ అలీ, పీఎం బాషాల అంత్యక్రియల ఖర్చులకు సంబంధించిన మొత్తాన్ని చెక్కుల రూపంలో అసిస్టెంట్ మేనేజర్ హరిమోహన్ శనివారం ఉద్యోగుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఒక్కో కుటుంబానికి రూ.15వేల చొప్పున మంజూరైనట్లు వెల్లడించారు.

శ్రీరామదూతం..శిరసానమామి

- వైభవంగా హనుమజ్జయంతి

బత్తలపల్లి: ఎక్కడ రామభద్రుడ్ని కీర్తిస్తామో అక్కడ జితేంద్రియుడు, వాతాత్మజుడైన హనుమంతుడు ప్రత్యక్షమవుతాడనేది భక్తుల విశ్వాసం. బుద్ధి నైశిత్యానికి.. ధైర్యానికి.. స్వామి భక్తికి.. బాహుబలానికి.. పాండితీ ప్రకర్షకు.. మారుపేరైన అంజనీ పుత్రుడిగా భక్తులతో స్తుతించబడే ఆంజనేయస్వామి జయంతిని శనివారం ధర్మవరం, పుట్టపర్తి, కదిరి, రాప్తాడు నియోజకవర్గాల్లో వైభవంగా నిర్వహించారు. బత్తలపల్లి మండలం పోట్లమర్రి, వేల్పుమడుగు, గుమ్మళ్లకుంట, విశ్వనాథపురం, మాల్యవంతం, సంజీవపురం, ఎం.చెర్లోపల్లి, ముష్టూరు, సంగాల తదితర గ్రామాల్లోని ఆలయాలు "జయ జయ హనుమా..జై చిరంజీవా" నామస్మరణతో మార్మోగాయి. వైశాఖాన్ని పురస్కరించుకొని హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో గణపతి పూజ, క్షీరాభిషేకం, సహస్ర నాగవల్లి పూజ, శ్రీహరి వాయుస్తుతితో తేనేభిషేకం, ఆకుపూజ, వడమాల, ఆంజనేయస్వామి మహత్యం ప్రవచనం వంటి కార్యక్రమాలను అర్చకులు కొమండూరు మారుతి ప్రసాద్, సాయికృష్ణ, రమేష్ నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నారులచే చెక్కభజన ఆకట్టుకుంది. కార్యక్రమాల్లో ఆయా గ్రామ పెద్దలు పాల్గొన్నారు. సంగాలలో సర్పంచు కంచనగారి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు.

మార్మోగిన రామనామం

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి పట్టణంలో హనుమజ్జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా పలు పుష్పదళాలతో అలంకరించారు. ఉదయం నుంచే శివప్రసాద్‌స్వామి ఆధ్వర్యంలో గణపతి పూజ, స్వస్తివచనం, రక్షాధారణ, కలశస్థాపన, హనుమద్ సూక్తం, పంచాభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణం, హనుమద్ హోమం నిర్వహించి మహాహారతితో ముగించారు. సాయంత్రం హనుమంతుడుని పురవీధుల్లో రామనామ సంకీర్తనలతో, సాయి నామస్మరణతో భజనలు చేసేకొంటూ జైహనుమా, జైజై హనుమా అంటూ నినదించారు. 17వ వార్డు బీడుపల్లి అభయాంజనేయస్వామి దేవాలయంలో స్నేహలత నర్సింగ్ హోమ్ అనంతపురం యజమాని డాక్టర్ అరుణ, మల్లికార్జునరెడ్డిదంపతుల ఆధ్వర్యంలో హనుమాన్‌జయంతిని వైభవంగా నిర్వహించారు. అభిషేకాలు, ఆకుపూజల అనంతరం పురోహితుల గురుస్వామి ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



చెన్నేకొత్తపల్లి: అలంకరణలో ఆంజనేయుడు



పోట్లమర్రిలో విశేష పూజలు అందుకుంటున్న వాయుపుత్రుడు



పుట్టపర్తిలో పుష్పాలంకరణలో ఆంజనేయస్వామి



మునగలవారిపల్లిలో గరుడాంజనేయ స్వామికి ఆకుపూజ



తలుపుల వైఎస్సార్ కాలనీలో పూజలందుకున్న ఆంజనేయస్వామి



అమడగూరు మండలం మహమ్మదాబాద్‌లో ఆంజనేయ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు

కదిరి టౌన్: హనుమాన్ జయంతి సందర్భంగా పట్టణంలోని పంచముఖ ఆంజనేయస్వామి, ద్వారక అంజనేయ స్వామి, సైదాపురం అంజనేయస్వామి ఆలయాల్లో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

ఆంజనేయునికి ప్రత్యేక పూజలు

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా ఉన్న ఆంజేయ స్వామి ఆలయాల్లో శనివారం హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆకుపూజ చేశారు. మునగలవారిపల్లి గరుడాంజనేయ స్వామి, వేపరాల ఆలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. వేపరాలలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా హనుమాన్ జయంతి

తలుపుల: హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం స్థానిక ఓబీఆర్ రోడ్డు, వైఎస్సార్ కాలనీ, బట్రేపల్లి, మూలపల్లి, గెరికపల్లి, ఓబులరెడ్డిపల్లి గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేష పూజలు చేశారు. ఉదయం కుంకుమార్చన, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మహామంగళహారతి, అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

ప్రత్యేక పూజలు.. అన్నదానాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని పలు దేవాలయాలలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని లింగశెట్టిపాలెం అభయాంజనేయస్వామి, కొత్తపేట సీతారామంజనేయ స్వామి, తేరుబజార్‌లోని శ్రీరామమందిరం, చెరువు కట్ట వద్ద ఆంజనేయస్వామి, దుర్గానగర్ ఆంజనేయ స్వామి ఆలయాల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెలిమి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. కాలభైరవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. పలు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు చేశారు.

ఘనంగా అంజన్న ఊరేగింపు

అమడగూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి విగ్రహాన్ని గ్రామాల్లో ఊరేగించారు. డప్పు, వాయిద్యాల నడుమ యువకులంతా చిందులేశారు. మహమ్మదాబాద్‌లో కేరళ వాయిద్యాలు ఆకట్టుకున్నాయి.

శ్రీ ఆంజనేయం.. ప్రసన్నాంజనేయం

నల్లచెరువు: పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో హనుమ జయంతి వేడుకలను ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవరింటి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భజన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.



ధర్మవరం కొత్తపేట సీతారామాంజనేయస్వామికి పూజలు చేస్తున్న అర్చకుడు



సంగాలలో అన్నదానం చేస్తున్న గ్రామస్తులు



కదిరిలో ఆంజనేయస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

చెన్నేకొత్తపల్లి: హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలోని ఆంజనేయ స్వామి దేవాలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. తొలుత ఆయా దేవాలయాల్లో స్వామి మూల విరాట్‌లకు అభిషేకాలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామికి ఫల, పుష్పాలను సమర్పించి పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీలు అన్నదానం చేపట్టాయి.

కనగానపల్లి: మండలంలో శనివారం హనుమాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కనగానపల్లి, మామిళ్లపల్లి, తగరకుంట, ముక్తాపురం, కుర్లపల్లి ఆంజనేయస్వామి దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయాలను ప్రత్యేకంగా అలకరించారు. కుర్లపల్లి వారదయ్య కొండపై వెలసిన ఆంజనేయ స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తరలివెళ్లారు.

జగనన్న సీఎం కావాలని పూజలు

నల్లచెరువు : వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలని, జగనన్న మరోమారు సీఎం కావాలని, హిందూపురం ఎంపీ అభ్యర్థి బోయ శాంతమ్మ, కదిరి ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ మక్బూల్ అహ్మద్ విజయం సాధించాలని నల్లచెరువు జెడ్పీటీసీ బసిరెడ్డి అనిత విశ్వనాథ్‌రెడ్డి పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆలయంలో 501 కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ దంపతులతో పాటు బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథనాయుడు, కదిరి మైనార్టీ నాయకుడు మైనుద్దీన్‌లను ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ దేరింటి భాస్కర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



పాలపాటిదిన్నెలో కొబ్బరి కాయలు కొడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సంయమనం పాటించండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నల్లచెరువు: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా కార్యకర్తలు సంయమనం పాటించి పోలీసులకు సహకరించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథ నాయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కళ్లిపల్లి శ్రీనివాసులు, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, రైతు విభాగం జిల్లా కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, మైనార్టీ విభాగం కార్యదర్శి నజీర్ శనివారం నల్లచెరువులో విలేకరులతో మాట్లాడారు. ఓట్ల లెక్కింపు రోజున ప్రత్యర్థి పార్టీ నాయకులు, కార్యకర్తలు కవ్వింపు చర్యలకు పాల్పడినా.. గొడవలకు దిగినా పోలీసులకు సమాచారం అందజేయాలని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతురెడ్డి, రామాంజనేయులు, బాబురెడ్డి, నవాజ్‌ఖాన్, జబీవుల్లాఖాన్ పాల్గొన్నారు.

ముగిసిన 'వేసవి వినోదం'



బహుమతులతో విజేతలు

కదిరి అర్బన్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక చలపతి టాలెంట్ స్కూల్‌లో వారం రోజులుగా నిర్వహిస్తున్న "వేసవి వినోదం" కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ వారం రోజుల్లో విద్యార్థులకు గణితంలో సాధన, పేపర్ కటింగ్స్, చిత్రలేఖనం, చెస్, క్యారమ్స్, వక్తిగత పరిశుభ్రత, ఇంద్రజాలం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు ఇందులో పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు నరసారెడ్డి, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రాయుడు, చిన్నారావు, కౌసర్‌సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

ఒకరోజు ముందుగానే వారపుసంత

నల్లమాడ: సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మంగళవారం జరగాల్సిన నల్లమాడ వారపు సంతను ఒకరోజు ముందు సోమవారం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు, వ్యాపారులు ఈ విషయాన్ని గుర్తించాలని కోరారు.

కౌంటింగ్ రోజు అల్లర్లు సృష్టిస్తే ఉపేక్షించం

చెన్నేకొత్తపల్లి: ఈనెల 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే ఉపేక్షించం. అలాంటి వారిపై రౌడీషీటర్ నమోదు చేస్తామని ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు సూచించారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ మండలంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రజలు గుంపులుగా చేరి గొడవలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున సభలు, సమావేశాలు, ర్యాలీలు చేపట్టేందుకు అనుమతి లేదన్నారు. విజయం సాధించిన పార్టీల వారు బాణాసంచా కాల్చేందుకు అనుమతి లేదని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జిల్లా బహిష్కరణ లేదా పీడీ యాక్ట్ అమలు చేస్తామన్నారు. కౌంటింగ్ రోజున కేంద్రసాయుధ బలగాలను మోహరిస్తామన్నారు. సమస్యాత్మక గ్రామల్లో డ్రోన్ కెమోరా ద్వారా వీడియోలను చిత్రీకరిస్తామన్నారు. మండల వ్యాప్తంగా ఎక్కడా మద్యం విక్రయాలు జరుపరాదని హెచ్చరించారు. రాజకీయ పార్టీల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో రామగిరి సీఐ శివాంజనేయులు, ఎస్ఐ వెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

చెన్నేకొత్తపల్లి: గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఎస్ఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఈ నెల 4వ తేదీన వెల్లడి కానుండటంతో మండలంలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా కార్డెన్ సర్చ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం వెంకటంపల్లిలో ఏపీఎస్పీ, స్థానిక పోలీసులతో కలసి తనిఖీలు చేశారు.



నాయకులకు సూచనలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

శాంతిభద్రతలకు సహకరించాలి

బత్తలపల్లి: ఎన్నికల ఫలితాలు వెలువడే వరకూ మండలంలోని ప్రతి రాజకీయ పార్టీ నాయకుడు శాంతిభద్రతలకు సహకరించాలని ఎస్ఐ శ్రీనివాసులు కోరారు. శనివారం సాయంత్రం పోలీస్ స్టేషన్‌లో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఇరుపార్టీల వారు ఎటువంటి అల్లర్లకు పాల్పడకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు.

= ఇదిలా ఉండగా మండలంలోని దంపెట్ల, ఉప్పర్లపల్లి గ్రామాల్లో ఎస్ఐ శ్రీనివాసులు పోలీసు సిబ్బందితో కలిసి పర్యటించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత ఒకరికొకరు సహకరించుకుని ప్రశాంత వాతావరణం కల్పించుకుందామన్నారు. అంతకుముందు అనుమానితుల ఇళ్లల్లోనూ, మద్యం విక్రేతల ఇళ్లల్లోనూ సోదాలు నిర్వహించారు. రౌడీషీటర్లకు, ట్రబుల్ మాంగర్స్‌కు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు సోమశేఖర్‌మూర్తి, తిరుపాలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే క్రిమినల్ కేసులు

అమడగూరు: ఓట్ల లెక్కింపు రోజున అల్లర్లు సృష్టిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ మగ్బూల్‌బాషా హెచ్చరించారు. శనివారం మండల వ్యాప్తంగా ఇటీవల బైండోవర్ చేసిన వివిధ రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలకు స్టేషన్ ఆవరణంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఓట్ల లెక్కింపులో ఏ పార్టీకి చెందిన వారు గెలిచినా, ఏ పార్టీ ఓడినా రెండు పార్టీల నాయకులు ప్రశాంతంగా ఉండాలన్నారు.

భంగం కలిగించొద్దు

తాడిమర్రి: జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని, ఎవ్వరూ ప్రజాశాంతికి భంగం కలిగించరాదని తాడిమర్రి పోలీసులు హెచ్చరించారు. కౌంటింగ్ రోజున బాణసంచాకు అనుమతి లేదన్నారు. టపాసులు అక్రమంగా నిల్వ ఉంచినా, విక్రయించినా చర్యలు తప్పవన్నారు.

ర్యాలీలు నిషేధం

ముదిగుబ్బ: ఎన్నికల నేపథ్యంలో విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలను నిషేధించినట్లు ముదిగుబ్బ రూరల్ సీఐ కృష్ణంరాజు పేర్కొన్నారు. శనివారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ సందర్భంగా ఎవరైనా గొడవపడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని రౌడీషీట్లు, జిల్లా బహిష్కరణలు, లేదా పీడీ యాక్ట్ అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో పట్నం ఎస్ఐ నరసింహుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

9న ఉచిత కంటి ఆపరేషన్ల శిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 9న ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రోటరీక్లబ్ అధ్యక్షులు జయసింహ, ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి తెలిపారు. సాంస్కృతిక మండలిలో శనివారం రోటరీక్లబ్ సభ్యులు కంటి వైద్య శిబిరం కరపత్రాలు విడుదల చేశారు. బెంగళూరులోని శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులతో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు చేయించి చూపును అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు సోలిగాళ్ల వెంకటేశులు, రామకృష్ణ, రత్నశేఖర్‌రెడ్డి, శివయ్య, సుదర్శన్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సజావుగా విత్తన వేరుశనగ పంపిణీ



వేరుశనగ కాయలను పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడిమర్రి: మండలంలో శనివారం సబ్సిడీ విత్తనకాయల పంపిణీ సజావుగా సాగింది. నార్సింపల్లిలో 111 మంది రైతులకు 99.9 క్వింటాళ్లు, పిన్నదరిలో 113 మంది రైతులకు 100.2 క్వింటాళ్ల సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలు పంపిణీచేసినట్లు వ్యవసాయాధికారి రమాదేవి తెలిపారు.

ఉజ్వల భవితకు బాట

- ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్
- ధర్మవరం నియోజకవర్గంలో 4 పాఠశాలల ఎంపిక
- ఈ విద్యా సంవత్సరం నుంచే బోధన అమలు
- జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో రాణించే అవకాశం

ధర్మవరం రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) బోధన అమలుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ధర్మవరం నియోజకవర్గంలో సీబీఎస్ఈ బోధనకు నాలుగు పాఠశాలలు ఎంపికయ్యాయి. పిల్లలు చదువులలో అభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ధర్మవరం నియోజకవర్గంలో తొలి విడత కింద ధర్మవరం, తాడిమర్రి, ముదిగుబ్బ కేజీబీవీలతో పాటు ధర్మవరం మోడల్ స్కూల్‌ను ఎంపిక చేసింది. ఈ బడుల్లో బట్టీ/మూస పద్ధతికి స్వస్తి పలికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ సిలబస్ అమలు చేయనున్నారు. ఇందు కోసం ఇప్పటికే విద్యాశాఖ అధికారులు ఎంపిక చేసిన పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

పేద విద్యార్థులకు ప్రోత్సాహం

ఇప్పటి వరకు కార్పొరేట్, ఇతర ప్రత్యేక పాఠశాలల్లోనే సీబీఎస్ఈ సిలబస్ అమలవుతోంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు విద్యార్థులు సిద్ధం కావాలంటే సీబీఎస్ఈ సిలబస్ కచ్చితంగా ఉండాలి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇలాంటి బోధన అందించాలన్న సంకల్పంతో చర్యలు తీసుకుంది. అన్ని రకాల వనరులు ఉండి పిల్లలు ఎక్కువ సంఖ్యలో ఉన్న పాఠశాలల్లో ఈ విధానాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేస్తున్నారు. 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు సీబీఎస్ఈ విధానంలో చదువుకునే అవకాశం ఉంటుంది. ఆయా విద్యాలయాల పర్యవేక్షణ కేంద్రంలోకి వెళ్తుంది. జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షలకు ఎంతో ఉపయోగం. విద్యార్థి అభ్యసన సామర్థ్యాలు పెంచేలా సిలబస్ ఉంటుంది. విద్యార్థుల ఆసక్తి, అభిరుచి గుర్తించి వివిధ రంగాల్లో వారిని ప్రోత్సహిస్తారు. అవసరం మేరకు సబ్జెక్ట్ టీచర్లను నియమిస్తారు.



సీబీఎస్ఈ సిలబస్‌కు ఎంపికైన ధర్మవరం మోడల్ స్కూల్

సీబీఎస్ఈ సిలబస్ ప్రయోజనాలివీ..

సీబీఎస్ఈ పుస్తకాలు ఆసక్తిగా.. విద్యార్థులకు అర్థమయ్యేలా ఉంటాయి. ఈ సిలబస్ ఎటువంటి ఒత్తిడికీ గురిచేయదు. విద్యార్థికి స్నేహ పూర్వకంగా ఉంటుంది. పోటీ పరీక్షల్లో విద్యార్థులు విజయం సాధించేందుకు దోహదపడతాయి. యాంత్రిక విద్యకు దూరంగా ఉంటూ వాస్తవాలకు దగ్గరగా బోధిస్తారు. పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెద్దగా ప్రాధాన్యం కల్పించరు. సబ్జెక్టుల వారీగా ఏ మేరకు నేర్చుకున్నారన్నది పరీక్షించేలా ప్రశ్నపత్రాలు రూపొందిస్తారు. ఐఐటీ వంటి కేంద్రీకృత సంస్థ నుంచి భవిష్యత్ అధ్యయనాలు కొనసాగించుకోవాలంటే సీబీఎస్ఈ పాఠ్యాంశాలు సహాయపడతాయి. ఈ సంస్థల ప్రాథమిక పరీక్షలు సీబీఎస్ఈ ఆధ్వర్యంలో మాత్రమే నిర్వహిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఈ ఏడాది నుంచి తొలి విడతలో ఎంపిక చేసిన ప్రభుత్వ బడుల్లోని సీబీఎస్ఈ సిలబస్ ద్వారా బోధన ఉంటుంది. కార్పొరేట్ స్థాయిలో అభ్యాసాలు ఉంటాయి. ఇది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్‌కు దోహదపడుతుంది. జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో ఈ విద్య ఎంతగానో ఉపయోగపడుతుంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సీబీఎస్ఈ సిలబస్ వరం. విద్యార్థులు ఈ బోధనను సద్వినియోగం చేసుకోవాలి.

– గోపాల్ నాయక్ ఎంఈఓ, ధర్మవరం